
సాక్షి
బాపట్ల
శుక్రవారం । 8 । నవంబర్ । 2024






## పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 9,235 క్యూసెక్కులు వస్తుండగా, 16 వేల క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో 41.39 టీఎంసీలు నిల్వ ఉంది.



## సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 6522 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 3040 క్యూసెక్కులు వదిలారు.

## లక్ష్మీనరసింహుని కళ్యాణ వార్షిక వేడుకలు



బెల్లంకొండ: చంద్రాజుపాలెంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామివారి తృతీయ వార్షిక కళ్యాణ వేడుకలు వైభవంగా జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజాదికాలు నిర్వహించారు.

## న్యూస్‌రీల్

### ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి



గుంటూరు ఎడ్యుకేషన్: దేశ ప్రయోజనాల కోసం నిరంతరం పాటుపడిన ఎన్జీ రంగా ఆశయ సాధనకు కృషి చేయాలని రాజ్యసభ మాజీ సభ్యుడు డాక్టర్ యలమంచిలి శివాజీ పేర్కొన్నారు. గురువారం రైతు బాంధవుడు ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా గుంటూరు బృందావన్‌గార్డెన్స్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి మాజీ ఎంపీ శివాజీతో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శివాజీ మాట్లాడుతూ రాజకీయాల్లోకి వస్తున్న యువతరం ఆచార్య రంగా జీవితాన్ని అధ్యయనం చేయాలని సూచించారు.

### గుండ్లకమ్మ నదిలో యువకుడి గల్లంతు



అద్దంకి రూరల్: స్నేహితులతో కలిసి సరదాగా నదిలో ఈత కొట్టేందుకు వెళ్లిన ఒక యువకుడు గల్లంతయ్యాడు. ఈ దుర్ఘటన అద్దంకిలోని గుండ్లకమ్మ నదిలో గురువారం సాయంత్రం జరిగింది. సీఐ కృష్ణయ్య వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం భట్లపల్లి గ్రామానికి చెందిన తేలుకుట్ల నారాయణ (27) అద్దంకిలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తుంటాడు. ఈనేపథ్యంలో తన మిత్రులైన కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన నేరేళ్ల వెంకటేష్, చిక్కాల భరత్‌నాయుడు, కావూరి ఫిలిప్ నలుగురు కలిసి గుండ్లకమ్మ నదిలో గురువారం సాయంత్రం స్నానానికి వెళ్లారు. నలుగురు నదిలో దిగి స్నానం చేస్తుండగా నారాయణ నది లోపలికి పోయి ఈత కొడుతూ కొట్టుకుపోయాడు. స్నేహితులు ఎంత వెతికినా కనిపించకుండా పోయాడు. సమాచారం తెలుసుకున్న సీఐ, ఫైర్ ఇంజిన్ సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహం ఇంకా లభించలేదు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. భార్య ప్రస్తుతం 9వ నెల గర్భిణి.

### 10న బాలబాలికల రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఏపీ చెస్ అసోసియేషన్, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ బాలబాలికల చెస్ పోటీలు నిర్వహిస్తున్నామని పోటీల నిర్వాహకుడు ఎం.గోపీనాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలను ఆదివారం గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో నిర్వహిస్తామన్నారు. మొత్తం నాలుగు విభాగాల్లో బాలబాలికలు పోటీపడతారన్నారు. విజేతలకు ట్రోఫీలను అందజేస్తామన్నారు. వివరాలకు 97030 49378 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ



అద్దంకి: ప్రకృతి వ్యవసాయంతోనే మానవాళికి ఆరోగ్యం అని బాపట్ల జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వాణిశ్రీ అన్నారు. ఆమె గురువారం బాపట్ల జిల్లా గోవాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ ప్రకృతి వ్యవసాయంతో దేశవాళీ వరి రకాలను పండిస్తున్న నరిశెట్టి రమేష్‌బాబు పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రత్నచోడి, జమ్ముతావి, ఇన్నపు సాంబ, చంద్రగండు, కాలాబట్టి, కాలాభట్, కొల్లం, మధుమాలతి వంటి పది రకాల పురాతన దేశీయ రకాలను రమేష్‌బాబు తన పది ఎకరాల భూమిలో పండిస్తున్నారని చెప్పారు. పలువురు రైతులకు విత్తనాలను సరఫరా చేస్తున్నారన్నారు. పలు రకాల కషాయాలు వాడి పంటలు పండిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారని తెలిపారు. ఆమెతో పాటు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోకిల వనజా రాణి, పద్మలత, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు



కావూరివారిపాలెం సమీపంలో ఇసుక తవ్వకాలతో చెరువులను తలపిస్తున్న పొలాలు

# ఇసుకాయస్వాహా!

**రెచ్చి పోతున్న పచ్చ నేతలు**

- అనుమతులు లేకుండా అసైన్డ్ భూముల నుంచి ఇసుక
- బాపట్ల, చీరాల, వేమూరు, పర్చూరు ప్రాంతాల నుంచి అక్రమ రవాణా
- నిబంధనలకు విరుద్ధంగా 30 అడుగుల లోతు తవ్వకాలు
- ట్రాక్టర్ ఇసుక రూ.5 నుంచి 10 వేలు..లారీ రూ. 30 వేలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఇసుక ఉచితంగా అందిస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి సర్కార్ కృష్ణానదిలో నీటి ప్రవాహం సాకుచూపి చేతులెత్తేసి కూర్చుంది. ఇది పచ్చ నేతలకు వరంగా మారింది. వంకలు, వాగులు, కృష్ణానది, గుండ్లకమ్మ, కుందేరు తదితర నదీ ప్రాంతాల నుంచే కాక సముద్ర తీర ప్రాంతం బాపట్ల, చీరాల, పర్చూరు ప్రాంతాల్లోని ప్రభుత్వ, అసైన్డ్, అటవీశాఖ భూముల నుంచి ఇసుకను అక్రమంగా తరలించి అధిక ధరలకు విక్రయిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రభుత్వం పిడికెడు ఇసుక కూడా అందించక పోవడంతో ఇసుకకూ డిమాండ్ పెరిగింది. ప్రధానంగా బాపట్ల పట్టణంతో పాటు చీరాల, రేపల్లె, వేమూరుల్లో మరింత డిమాండ్ నెలకొంది. ఇదే అవకాశంగా పచ్చ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. చీరాల రూరల్ పరిధి కావూరివారిపాలెం తులసీనగర్, గవినివారిపాలెం, పుల్లాయిపాలెం ప్రాంతాల నుంచి పచ్చనేతలు ఇసుక తవ్వి అమ్ముకుంటున్నారు. కావూరివారిపాలెం వద్ద నుంచి బాపట్ల నియోజకవర్గానికి చెందిన కొందరు పచ్చ నేతలు పెద్ద ఎత్తున తవ్వితీసి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. రాత్రిపూట అసైన్డ్ భూముల్లో సైతం యంత్రాలు పెట్టి 30 నుంచి 40 అడుగుల లోతుకు తవ్విపోస్తున్నారు. గుంతల్లో పెద్ద ఎత్తున నీరు చేరుతున్నా మోటార్లు పెట్టి నీటిని బయటకు పంపి తవ్వి తరలిస్తున్నారు. దీంతో అసైన్డ్ భూములు పెద్ద పెద్ద బావులను తలపిస్తున్నాయి. ఇసుక తవ్వకాలకు యంత్రాలు కాకుండా మనుషులను మాత్రమే ఉపయోగించాలని , ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో మాత్రమే తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వగా భారీ యంత్రాలతో తవ్వి ట్రిప్పర్లు, లారీలతో తరలిస్తున్నారు.

**నిబంధనలకు పాతరేసి...**

జిల్లాలోని గాజుల్లంక, జువ్వలపాలెం ప్రాంతాల్లో కృష్ణానది నుంచి మాత్రమే ఇసుక తవ్వి విక్రయించనున్నట్లు ఇటీవల కలెక్టర్ వెంకటమురళి ప్రకటించారు. నదిలో ఇప్పటికి ఎగువ నుంచి నీరు వస్తుండటంతో తవ్వకాలకు వీలులేకుండా పోయింది. దీంతో ప్రభుత్వం సరఫరా నిలిపి వేసింది. ఈ పరిస్థితిలో ప్రైవేటు భూముల నుంచి తరలించాలనుకునేవారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంటే నిబంధనల మేరకు అనుమతులు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. టన్ను రూ. 350 చొప్పున మాత్రమే అమ్మాలని స్పష్టం చేసింది. కానీ తవ్వకాల కోసం ఇప్పటివరకు ఒక్కరు కూడా దరఖాస్తు పెట్టలేదు.

**అనుమతులు లేకుండా అక్రమ తవ్వకాలు**

ఎటువంటి అనుమతులు లేకుండానే చీరాల, బాపట్ల, చినగంజాం ప్రాంతాల నుంచి పచ్చనేతలు అక్రమంగా ఇసుక తరలిస్తున్నారు. ప్రధానంగా వేటపాలెం, చినగంజాం ప్రాంతాల్లోని పలు అసైన్డ్, అటవీ, ప్రభుత్వ భూముల నుంచి ఇసుక పెద్ద ఎత్తున రవాణా అవుతోంది. చినగంజాం మండలం కడవకుదురులోని భూముల నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి బాపట్ల పట్టణంతోపాటు, చీరాల, పర్చూరు ప్రాంతాలతోపాటు ప్రకాశం, పల్నాడు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు తరలిపోతోంది. స్థానికంగా ట్రాక్టర్ ఇసుక రూ. 5 వేలకు విక్రయిస్తున్న పచ్చనేతలు దూర ప్రాంతాలకు రూ. 7 నుంచి 10 వేలు అమ్ముతున్నారు. లారీ రూ. 25 వేల నుంచి దూరాన్ని బట్టి రూ. 35 వేలకు అమ్ముతున్నారు. కొన్ని ప్రాంతాల నుంచి రాత్రి పూట తరలించి అమ్ముకుంటున్నారు. ఇక కొల్లూరు మండలంలోని కృష్ణానదిలో పచ్చనేతలు ఇసుక తవ్వి పలు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

## జీవనశైలి మార్పుతో క్యాన్సర్‌కు దూరం

**కలెక్టర్ వెంకట మురళి**



క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్ వెంకట మురళి

బాపట్ల: జీవనశైలి, ఆహారపు అలవాట్లు మార్చుకుంటే క్యాన్సర్‌కు దూరంగా ఉండొచ్చని కలెక్టర్ జె.వెంకట మురళి చెప్పారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా గురువారం స్థానిక మున్సిపల్ హైస్కూల్ వద్ద నుంచి పాత బస్టాండ్ సెంటర్ వరకు చేపట్టిన ర్యాలీని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పాత బస్టాండ్ కూడలిలో విద్యార్థులు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ, డీసీహెచ్ఎస్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శేషుబాబు, ఆర్డీఓ పి.గ్లోరియా తదితరులు పాల్గొన్నారు.

**మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి**

మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేయాలని కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులకు సూచించారు. డీఆర్‌డీఏ ద్వారా అమలయ్యే పథకాలపై ఆయన గురువారం సమీక్ష నిర్వహించారు. డ్వాక్రా సంఘాల బలోపేతానికి సూచనలు, సలహాలు ఇచ్చారు. రుణ లక్ష్యాలను పూర్తిచేయాలని సూచించారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని బ్యాంకర్లకు తేల్చిచెప్పారు. డ్వాక్రా సంఘాల నుంచి బ్యాంకులకు రావాల్సిన బకాయిల పైనా ఆరా తీశారు. పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎం ఈ పథకాల ద్వారా మహిళలకు యూనిట్లు మంజూరు చేయాలన్నారు. ఉన్నతి పథకం నిధులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జేసీ ప్రఖర్ జైన్, డీఆర్డీఏ పీడీ పి.పద్మ, ఎల్‌డీఎం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజారోగ్యంపై 14 నుంచి ఇంటింటి సర్వే**

ప్రజారోగ్యంపై ఈనెల 14 నుంచి ఎన్‌సీడీసీ ఇంటింటి సర్వే చేపడుతున్నట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై డివిజన్ మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఆరోగ్య సర్వేపై సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం పైనా సమీక్షించారు. ఉచిత ఇసుక విధానం అమలులో ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. జేసీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ భూముల రీ సర్వే వేగవంతానికి చర్యలు చేపట్టాలన్నారు. గ్రీవెన్స్ అర్జీలపైనా దృష్టి పెట్టాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో గంగాధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

## కూటమి పాలనలో మాదిగలకు రక్షణ లేదు

- రాష్ట్ర దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగేంద్రరావు
- బలవన్మరణం పాలైన వైఎస్సార్ సీపీ కార్యకర్త, దళిత రైతు కుటుంబానికి పరామర్శ



శ్రీను కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతున్న నాగేంద్రరావు

బల్లికురవ: కూటమి పాలనలో మాదిగలకు రక్షణ లేకుండా పోయిందని రాష్ట్ర దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగేంద్రరావు విమర్శించారు. ఇటీవల బలవన్మరణం చెందిన చినజమ్ములమడకకు చెందిన దళిత రైతు, వైఎస్సార్ సీపీ కార్యకర్త చింతల శ్రీను కుటుంబాన్ని గురువారం నాగేంద్రరావు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా నాగేంద్రరావు విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ నాయకుల మీద సోషల్ మీడియా పోస్టులు పెట్టి అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అరెస్టు చేయడానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. చింతల శ్రీనుకు సర్వే నంబర్ 756లో సుమారు 20 ఎకరాల భూమి ఉందని, పంటలు పండక పోవటంతో వలస వెళ్లటంతో అగ్రవర్ణాలకు చెందిన మన్నేపల్లి వెంకటేశ్వర్లు ఆ భూములను ఆన్‌లైన్ చేయుంచుకున్నాడని చెప్పారు. విషయం తెలుసుకున్న శ్రీను రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అగ్రవర్ణ రైతులు తనకున్న వ్యవసాయ భూమి 20 ఎకరాలను ఆక్రమించుకోగా ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వెంకటేశ్వర్లుతో పాటు పోలీసులు వేధింపులు పెరిగాయని దీంతోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. కనీసం మాదిగ రైతు చనిపోతే పరామర్శకు సైతం రెవెన్యూ, పోలీసులు భయపడుతున్నారని చెప్పారు. మంత్రి కనుసన్నల్లో కేసును నీరుగార్చుతున్నారని, విచారణ నుంచి చీరాల డీఎస్పీని తప్పించాలని డిమాండ్ చేశారు. శ్రీను బలవన్మరణానికి కారకులైన అగ్రకుల నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని నాగేంద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర గిరిజన సంఘ నాయకుడు గంట సుబ్బారావు, మాలమహానాడు ప్రధాన కార్యదర్శి కానుమాను రవి పాల్గొన్నారు.

## నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

**రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి**



మధ్యాహ్న భోజనం సాంబార్ తయారీని పరిశీలిస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

చీరాల అర్బన్: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి చెప్పారు. గురువారం ఆయన చీరాలలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చీరాల మండలం ఈపూరుపాలెం పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిభా గాంధీ బాలికల పాఠశాల, జాండ్రపేట హైస్కూల్, చౌకధరల దుకాణాలు, పౌరసరఫరాల గోడౌన్‌లను ఆయన పరిశీలించారు. ఏపీ మోడల్ స్కూల్‌లో వసతులు సరిగా లేవని స్కూల్ మేనేజింగ్ కమిటీ చైర్మన్ దగ్గుబాటి రాంబాబు ఆయనకు ఫిర్యాదు చేశారు. దాతలు 20 క్యాన్ల మంచినీరు ఇస్తే హాస్టల్‌కు ఆరు క్యాన్లు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్‌లో గత ప్రభుత్వంలో నాడు–నేడు ద్వారా నిర్మించిన మంచినీటి ప్లాంట్ నిరుపయోగంగా ఉండడాన్ని విజయప్రతాప్ రెడ్డి గుర్తించారు. మెమోలు జారీ చేస్తామన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ హాస్టళ్లలో పలు సమస్యలు ఉన్నాయని చెప్పారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన మెనూ అమలు చేస్తున్నా నాసిరకం కూరగాయలు, పాలు తగిన నాణ్యత లేకపోవడం, చికెన్ కూడా తగినంత ఇవ్వకపోవడం వంటివి జరుగుతున్నాయని పేర్కొన్నారు. వేటపాలెంలో ఓ హైస్కూల్‌లో 210 మందికి అర కొరగా సాంబారు చేశారని వెల్లడించారు. మధ్యాహ్న భోజన పథకం పర్యవేక్షణలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. వేటపాలెం హైస్కూల్లో వంట ఏజెన్సీని రద్దు చేయాలని డీఈఓకు సిఫార్సు చేస్తున్నట్టు వెల్లడించారు. ప్రధానోపాధ్యాయునికి మెమో ఇస్తామన్నారు. అనంతరం ఆయన చీరాలలోని పౌరసరఫరాల గోడౌన్‌ను పరిశీలించామన్నారు. ఆహార పంపిణీలో లోటుపాట్లను సరిదిద్దుతామన్నారు. తాము కూడా సుమోటోగా కేసులు తీసుకుని జరిమానాలు విధిస్తామన్నారు.

## ప్రపంచ వేదికపైకి 'కోటి' ఆశలతో..

**'పంచ్' ప్రాణాలూ పణంగా పెట్టి**

- పతకాల వేటే లక్ష్యం
- విజయాల పరంపర
- ఏషియన్ కిక్ బాక్సింగ్‌లో కాంస్యం
- ఇటలీలో జరిగే ప్రపంచ కప్‌కు అర్హత
- రాష్ట్రంలోనే తొలి క్రీడాకారుడిగా గుర్తింపు
- కిక్ బాక్సింగ్‌లో రాణిస్తున్న కోటి నాగబాబు



ప్రపంచకప్ పోటీలకు స్పాన్సర్‌షిప్ చేస్తామని హామీ ఇస్తున్న రామచంద్ర ప్రభు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఎవరి సాయం లేకుండా అకుంఠిత దీక్షతో కఠోర సాధనతో క్రీడల్లో రాణించేవారు చాలా అరుదుగా ఉంటారు. అలాంటి వారిని వారు సాధించిన విజయాలే ప్రపంచానికి పరిచయం చేస్తాయి. ఇదే కోవకు చెందుతారు కోటి నాగబాబు. ఆయన కిక్ బాక్సింగ్‌లో దూసుకుపోతున్నారు. ఏషియన్ పోటీల్లో సత్తాచాటి ఇటలీలో జరిగే ప్రపంచ్ కప్‌కు అర్హత సాధించారు. అంతర్జాతీయ యవనికపై గుంటూరు కీర్తిని రెపరెపలాడించేందుకు సిద్ధమవుతున్నారు.

**సరదాగా ప్రారంభించి..**

గుంటూరు రూరల్ మండలం ఏటుకూరులో ఉంటున్న యాసం కోటి నాగబాబు స్వగ్రామం రేపల్లె దగ్గర్లోని కారుమూరు. తండ్రి శ్రీనివాసరావు. తల్లి లంకా బసవపూర్ణమ్మ వీఆర్‌ఏ. తండ్రి దూరంగా ఉంటున్నారు. తల్లి సంపాదనే కుటుంబానికి ఆసరా. అయినా నాగబాబు పేదరికాన్ని ఎదిరించి తనకంటూ ఓ లక్ష్యాన్ని ఏర్పరుచుకున్నారు. సినిమాల ప్రభావంతో సరదాగా తైక్వాండోలో శిక్షణ తీసుకున్నారు. మూడేళ్ల సాధన తర్వాత కిక్ బాక్సింగ్‌పై అతని దృష్టి మళ్లింది. ఈ సమయంలో ఆర్థికంగా అంతంతమాత్రంగా ఉన్న కోటిని ఓ పెద్దాయన ఏటుకూరుకు చెందిన సీతారామయ్యకు పరిచయం చేశారు. దీంతో సీతారామయ్య కోటిని సొంత బిడ్డలా చూసుకుంటూ ఆశ్రయం కల్పించారు. వసతులు సమకూర్చారు. దీంతో 15 నెలల నుంచి కోటి కిక్ బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారు. సీతారామయ్య సూచనతో తులసి సీడ్స్ అధినేత రామచంద్రప్రభు కూడా కోటికి ఆసరాగా నిలిచారు. సహకారం అందిస్తానని మాట ఇచ్చారు.

**కఠోర సాధనతో ఇంటర్నేషనల్ బాక్సర్‌గా..**

దీంతో కోటి పట్టుదలతో శిక్షణ కొనసాగించారు. కఠోరన సాధన చేశారు. ఫలితంగా గత నెల కాంబోడియాలో జరిగిన ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో 84 కేజీల విభాగంలో కాంస్య పతకంతో సహా రెండు పతకాలు సాధించి ఔరా అనిపించుకున్నారు. ఏపీ నుంచి ఈ పతకాలు సాధించిన తొలి వ్యక్తి కోటి కావడం గమనార్హం. వచ్చే ఏడాది మార్చిలో ఇటలీలో జరగనున్న వరల్డ్ కప్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ప్రస్తుతం ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్ హోదాను పొందారు.

**సాధించిన విజయాలు**

- 2023లో విశాఖలో జరిగిన జాతీయ శిక్షణ ట్రైల్స్‌లో కాంస్యం పతకం.
- అదే ఏడాది పంజాబ్‌లో నిర్వహించిన ఆల్ ఇండియా సీనియర్ నేషనల్స్‌కు అవకాశం.
- మొత్తం 54 విభాగాల్లో 7,000 మంది పాల్గొన్న సీనియర్ నేషనల్స్ మహాటోర్నీలో 17వ స్థానం.
- స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) ఆధ్వర్యంలో సిమ్లాలోని షిలారు కోచింగ్ క్యాంప్‌కు అర్హత.
- విదేశీ కోచ్‌ల తర్ఫీదులో కొత్త మెళకువలు
- ఈ ఏడాది ఫిబ్రవరిలో డిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ చాంపియన్ షిప్‌లో రెండు కాంస్య పతకాలు.
- ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు

**కిక్ బాక్సింగ్ ప్రాణం**

ప్రాణం పణంగా పెట్టి కిక్ బాక్సింగ్‌కు సిద్ధమవుతున్నా. పేద కుటుంబం నుంచి వచ్చా. సీతారామయ్య, రామచంద్రప్రభుల సహకారంతో ముందుకు సాగుతున్నా. వారి రుణం తీర్చుకోలేనిది. ఇంటర్నేషనల్ కోచ్ (ఏపీ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు) జి.ఆనంద్‌పాల్ శిక్షణలో ఎంతో నేర్చుకుంటున్నాను. జిల్లా తరఫున ప్రపంచ కప్ పోటీల్లో దేశానికి పతకం తేవడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. ప్రస్తుతం నాకు విదేశీ కోచ్‌ల శిక్షణ చాలా అవసరం. శాప్‌లో ప్రస్తుతం కిక్ బాక్సింగ్ లేదు. దీనిని కూడా ఏర్పాటు చేయాలి. ఏషియన్ మెడల్స్ సాధించడంలో ఎందరో సహకారమందించారు. వారికి ధన్యవాదాలు.

– యాసం కోటి నాగబాబు, ఇంటర్నేషనల్ కిక్ బాక్సర్



కాంబోడియాలో జరిగిన ఏషియన్ పోటీల్లో పతకంతో విజయ దరహాసం

## కోన ప్రభాకర్‌రావు విగ్రహం ఏర్పాటును అడ్డుకున్న టీడీపీ

**విగ్రహం కోసం ఏర్పాటు చేసిన దిమ్మె తొలగింపు**

బాపట్ల: బాపట్ల పట్టణంలో మాజీ గవర్నర్ కోన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటును తెలుగుదేశం పార్టీ నాయకులు కక్ష పూరితంగా అడ్డుకున్నారు. పగలు నిర్మాణ పనులతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పి రాత్రి నిర్మాణం చేసుకునేందుకు అనుమతి ఇచ్చిన మున్సిపల్ అధికారులు, గురువారం రాత్రి పనులు ప్రారంభించిన కొద్దిసేపటికే టీడీపీలు నాయకులు చెప్పటంతో విగ్రహం ఏర్పాటును అడ్డుకున్నారు. బాపట్ల అభివృద్ధిలో ఎనలేని కృషి చేసిన ప్రభాకరరావు విగ్రహం ఏర్పాటును అడ్డుకోవటాన్ని వైఎస్సార్‌సీపీ తీవ్రంగా ఖండించింది. పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో 18 ఏళ్ల కిందట కోన ప్రభాకరరావు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా ఆ విగ్రహాన్ని తొలగించారు. తిరిగి నిర్మించేందుకు అధికారులు అనుమతి ఇచ్చినా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. దీనిపై వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య తీవ్ర నిరసన తెలిపారు.



వైఎస్సార్‌సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

## క్లుప్తంగా

### క్రమశిక్షణతో పని చేస్తే మంచి గుర్తింపు

కలెక్టర్ జె.వెంకట మురళి



బాపట్ల: క్రమశిక్షణతో పని చేస్తే మంచి గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ జె.వెంకటమురళి పేర్కొన్నారు. బదిలీపై వెళ్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు వీడ్కోలు సమావేశం కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రెవెన్యూ అధికారిగా సత్తిబాబు అందించిన సేవలు అభినందనీయమన్నారు. అనంతరం శాలువా, పుష్పగుచ్ఛంతో ఆయనను సన్మానించారు. జేసీ ప్రఖర్ జైన్, ప్రస్తుత డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్, బాపట్ల, చీరాల ఆర్డీఓలు గ్లోరియా, చంద్రశేఖర్ నాయుడు, డీఎస్‌ఓ విలియమ్స్ తదితరులు పాల్గొన్నారు.

### ఈర్లకొండ క్వారీల్లో భద్రతా వారోత్సవాలు



బల్లికురవ: గ్రానైట్ గనుల్లో భద్రతా చర్యలు పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల మైన్స్ బృందం సభ్యులు బ్రహ్మయ్య, బాబా ఫకీరుద్దీన్ అన్నారు. గురువారం బల్లికురవ సమీపంలోని ఈర్లకొండలో కృష్ణసాయి, సాయిలక్ష్మి, సాయి శ్రీనివాస, వీకే గ్రానైట్స్‌లో భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ చేసి, కార్మికులకు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం క్వారీ రికార్డులు, హద్దులు, మ్యాప్, భద్రతా చర్యలు, అందుతున్న సౌకర్యాలను బృందం నిశితంగా పరిశీలించింది. భద్రతా చర్యలు, నిబంధనలు కచ్చితంగా పాటిస్తూ ప్రమాదాలు సంభవించని క్వారీలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఆయా క్వారీల మేనేజర్లు పాల్గొన్నారు.

### 10న డీఎస్సీ ఆన్‌లైన్ స్క్రీనింగ్ పరీక్ష

నెహ్రూనగర్: సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం ఈ నెల 10న ఆన్‌లైన్ స్క్రీనింగ్ నిర్వహించనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి మధుసూదన్‌రావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 320 మంది దరఖాస్తు చేసుకున్నారని, స్క్రీనింగ్ పరీక్ష తర్వాత క్వాలీఫై అయిన 100 మందికి రెసిడెన్షియల్ డీఎస్సీ కోచింగ్ మూడు నెలలు ఇస్తామన్నారు.

# జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో'

కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని



సాహో పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, కలెక్టర్ నాగలక్ష్మి తదితరులు

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి 'సాహో' ప్రత్యేక ప్రణాళిక ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులు సమీకరిస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు జీజీహెచ్ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో డాక్టర్ పెమ్మసాని మాట్లాడుతూ.. జీజీహెచ్‌లో వైద్య సౌకర్యాలు మెరుగు పరిచేందుకు జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో 60 అంశాలపై చర్చించామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులతో చర్చించామన్నారు. బొంగరాలబీడు ఈఎస్‌ఐ హాస్పిటల్ స్థలంలో ఆక్రమణలు జరుగుతున్నందున ఆ స్థలానికి ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గుంటూరు జీజీహెచ్‌లో సర్వీస్ బ్లాక్ నిర్మాణం కోసం ప్రముఖ పారిశ్రామిక వేత్త తులసి రామచంద్రప్రభు రూ. 5 కోట్లు విరాళం ఇస్తామని గతంలో హామీ ఇచ్చారని చెప్పారు. ప్రస్తుత అంచనాల ప్రకారం నిర్మాణ ఖర్చులు పెరిగిన దృష్ట్యా తన స్నేహితుడు రూ. కోటి విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చినట్లు మంత్రి వెల్లడించారు. జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా బస్సు ఏర్పాటు చేస్తామని, జన ఔషధి మెడికల్ షాపులు ఆసుపత్రిలో పెట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తులసి రామచంద్రప్రభు నర్సింగ్ విద్యార్థుల కోసం రూ. 50 లక్షలతో బస్సు కొనుగోలుకు ముందుకు వచ్చారని వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వారు రూ. 6 లక్షల విలువైన పరికరాలను అందజేసినట్లు వెల్లడించారు. కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన 12 సంవత్సరాల లక్ష్మణ ఆదిత్యకు ఇటీవల కాలేయ మార్పిడి జరిగిందని మంత్రి తెలిపారు. ఆపరేషన్ అనంతరం ఆర్థిక సమస్యలు రావడంతో బాధితులు తమను సంప్రదించగా, ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 7 లక్షలు సహాయం అందించామని వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి. సుందరాచారి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ నసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## శిశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలి



శిశువు తల్లితో మాట్లాడుతున్న లీలావతి

గుంటూరు మెడికల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి గురువారం గుంటూరు జీజీహెచ్ నవ జాత శిశు రక్షణ వార్డును సందర్శించారు. జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు క్యాలెండర్ యాక్టివిటీస్‌లో భాగంగా ప్రపంచ శిశు రక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిగింది. నవజాత శిశువులకు అందుతున్న వైద్య సేవల గురించి శిశువుల తల్లులు, వైద్యులతో మాట్లాడి ఆమె తెలుసుకున్నారు. నవజాత శిశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు వివరించారు. పుట్టినప్పటి నుంచి శిశువులకు ఇవ్వాల్సిన టీకాలు, తల్లిపాల ప్రాధాన్యత, పౌష్టికాహారం ఏవిధంగా అందించాలనే విషయాలను వివరించారు. కాలుష్య రహిత గాలి శిశువులకు అందేలా చూడాలన్నారు. పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్న వెంటనే ఆసుపత్రిలో సరి చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ కట్టా కాళిదాస్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, ప్రొఫెసర్ డాక్టర్ ఝాన్సీవాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ శివరంజని, డాక్టర్ స్వరూప్‌రాణి పాల్గొన్నారు.

## వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న తయారీ కేంద్రం

తెనాలి రూరల్: వార్నిష్ తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం సంభవించింది. పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం చోటుచేసుకుంది. మండలంలోని సోమసుందరపాలెం ఆటోనగర్‌లో కోస్టల్ కెమికల్ ఇండస్ట్రీస్ పేరిట కలపకు వేసే వార్నిష్ తయారీ కేంద్రం నడుస్తోంది.

బుధవారం అర్ధరాత్రి దాటాక ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో నిర్వాహకుడు మహమ్మద్ రియాజ్ అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం సంభవించిందని భావిస్తున్నారు. రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు నిర్వాహకుడు తెలిపారు.

### హిందీ పరీక్షలో తెనాలి విద్యార్థిని ప్రతిభ



తెనాలి: హిందీ ప్రేమీమండలి మహా విద్యాలయం 9వ తరగతి విద్యార్థిని రాసంసెట్టి పూజిత గోవర్ధన భవాని (14) దక్షిణ భారత హిందీ ప్రచార సభ(ఆంధ్ర) నిర్వహించిన మధ్యమ పరీక్షలో ప్రథమంగా ఉత్తీర్ణత సాధించింది. హిందీ ప్రచారసభ కార్యదర్శి జానకి ఈ మేరకు సమాచారం పంపారు. బాలికను మండలి అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ ఈలప్రోలు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

### 18లోపు టెన్త్ పబ్లిక్ పరీక్ష ఫీజు చెల్లించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోపు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, మూడు కంటే తక్కువ సబ్జెక్టులకు రూ.110 చొప్పున ఫీజును ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తమ లాగిన్ ద్వారా విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు.

### విద్యార్థుల అంతర్జాతీయ పర్యటనపై ఐఎస్సీ ప్రత్యేక శ్రద్ధ



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున వర్సిటీ విద్యార్థుల విదేశీ పర్యటనపై ఏఎన్‌యూ ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ సెల్ (ఐఎస్సీ) ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య పి. పద్మావతి తెలిపారు. విదేశీ పర్యటన ముగించుకుని ఏఎన్‌యూకి చేరుకున్న ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు షేక్ సమీర్, టి వసంత బాబులకు వీసీ ఆచార్య కె. గంగాధరరావు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మావతి మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యార్థులు జపాన్‌లో గత నెలలో జరిగిన సకురా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాం–2024లో పాల్గొన్నారని తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యాచురల్ మెడిసిన్‌లో వివిధ ఔషధాల పనితీరును విద్యార్థులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణల పట్ల అవగాహన పెరుగుతుందన్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, ఓఎస్‌డీ ఆచార్య ఆర్‌ఎస్‌ఎస్‌ఎన్ రవికుమార్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ పి.బ్రహ్మాజీరావు తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

### వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

పెదకాకాని: ఇల్లు అద్దెకు కావాలని వచ్చి వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన కొప్పురావూరు గ్రామంలో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో నివాసం ఉంటున్న వృద్ధురాలు బొర్రా సుజాత వద్దకు గురువారం ఉదయం 10.30 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి పోస్టుమెన్‌గా పనిచేస్తున్నానంటూ పరిచయం చేసుకున్నాడు. తన భార్య సమీపంలోని విశ్వశాంతి స్కూల్‌లో టీచర్ అని చెప్పాడు. రోజూ గుంటూరు నుంచి ఇంటికి రావడానికి ఇబ్బందిగా ఉంటుందని.. ఇల్లు అద్దెకు కావాలన్నారు. ఇల్లు చూసుకుంటున్నామని నమ్మించాడు. ఆ వృద్ధురాలు ఇచ్చిన సమాచారం ఆధారంగా మూడు ఇళ్లు చూసి... సాయంత్రం తన భార్యను తీసుకుని వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. సాయంత్రం 3 గంటల సమయంలో తిరిగి కొప్పురావూరు చేరుకుని తన భార్య ఈ రోజు రాలేనని చెప్పిందని పేర్కొన్నాడు. రేపు వస్తామని చెప్పి వెళ్లడానికి వచ్చానని వృద్ధురాలిని నమ్మించాడు. తాగడానికి నీళ్ళు ఇమ్మని చెప్పడంతో లోపలికి వెళ్లింది. వెంట ఆతడు కూడా వెళ్ళి మెడలో బంగారు చైన్ లాక్కుని క్షణాల్లో మాయమయ్యాడు. వృద్ధురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కొప్పురావూరు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

### 14 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్ : జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ర్యాలీ ఏర్పాటు చేశారు. దీనిని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీ సీడీ 3.0 కార్యక్రమం ఈ నెల 14న ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏఎన్‌ఎం, ఆశ, సీహెచ్‌ఓలు ప్రతి మంగళ, గురు, శుక్రవారాలలో ఇళ్లను సందర్శించాలన్నారు. వారానికి 45 గృహాలను సందర్శించి 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ముక్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయాలన్నారు. 30 సంవత్సరాలు దాటిన వారందరికి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో వైద్యులు పరీక్షలు చేయాలని పేర్కొన్నారు. క్యాన్సర్ అనుమానిత కేసులను ప్రతి మంగళ, శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు తీసుకెళ్లాలన్నారు. క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండి, ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేస్తే పూర్తిగా నివారించవచ్చునని చెప్పారు. అవగాహన ర్యాలీ డీఎంహెచ్‌ఓ కార్యాలయం నుంచి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ వరకు సాగింది. గుంటూరు మెడికల్ కాలేజీ ఎస్‌పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సీతారామ, డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, డాక్టర్ గిరిధర్, డెమో జయప్రసాద్, అసిస్టెంట్ మలేరియా అధికారి రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు సత్తెనపల్లిలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు



ముస్తాబైన క్రీడా మైదానం

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్–19 బాల, బాలికల ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభం కానున్నాయి. మొత్తం మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి 26 బాల, బాలికల జట్లు హాజరుకానున్నట్లు ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. నరసింహారావు గురువారం తెలిపారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 540 మంది క్రీడాకారులు, 40 మంది కోచ్‌లు, 20 మంది రిఫరీలు హాజరుకానున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున క్రీడా సందడి నెలకొననుంది. పట్టణంలోని శరభయ్యగుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బాలురకు, సత్తెనపల్లి మండలం నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో బాలికలకు ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. క్రీడాకారులకు, క్రీడలను వీక్షించే క్రీడాభిమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.



## ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి



రావినూతలలో విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న పద్మావతి

మేదరమెట్ల: ఉపాధ్యాయుల చేతుల్లోనే విద్యార్థుల భవిష్యత్ ఉందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి పేర్కొన్నారు. గురువారం కొరిశపాడు మండలంలోని పలు పాఠశాలలను ఆమె తనిఖీ చేశారు. అందులో భాగంగా రావినూతల జెడ్పీ హెచ్‌ఎస్ విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడారు. బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని సూచించారు. చట్టాలపై అవగాహన ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. పాఠశాలలోని రికార్డులను, స్టాకు వివరాలను పరిశీలించారు. అలాగే దైవాలరావూరు జెడ్పీహెచ్‌ఎస్, ఎంపీపీఎస్, అంగన్‌వాడీ కేంద్రం, పమిడిపాడు జెడ్పీహెచ్‌ఎస్, కుర్రవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రాలు, కొరిశపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆమె తనిఖీ చేసి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఎంఈఓలు పున్నయ్య, వీరరాఘవరావు, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్‌డబ్ల్యూ వీరాంజనేయులు, మహిళా కానిస్టేబుల్ శారద ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉన్నారు.

## 15 వరకు పోస్టల్ ప్రత్యేక క్యాంపులు

- డీబీటీకి ఆధార్, ఖాతా అనుసంధానం కీలకం
- రేపల్లె అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు



మాట్లాడుతున్న ఏడుకొండలు

రేపల్లె రూరల్: ఖాతాదారుల సౌకర్యార్థం పోస్టల్ శాఖలో అనేక నూతన సంస్కరణలు చేసినట్లు రేపల్లె పోస్టల్ కార్యాలయ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఏడుకొండలు తెలిపారు. పట్టణంలోని హెడ్ పోస్టాఫీస్ ఆవరణలో కార్యాలయ పరిధిలోని వివిధ బ్రాంచ్‌ల పోస్ట్ మాస్టర్లతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖాతాదారులు బ్రాంచ్‌తో సంబంధం లేకుండా దేశంలోని ఏ పోస్ట్ ఆఫీసులోనైనా ఖాతాపరమైన సేవలు పొందవచ్చన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు సంబంధించిన నగదు బదిలీ పద్ధతి (డీబీటీ) ద్వారా లబ్ధిదారులకు పోస్టాఫీసు నుంచి సేవలను ప్రారంభించామన్నారు. నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుడి ఖాతాలో పథకానికి సంబంధించిన నగదు జమ కావాలంటే.. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) మ్యాపర్‌లో ఆధార్ కార్డుకు ఖాతాదారుడి ఖాతా నంబరు జత చేసి ఉండాలని చెప్పారు. నేటికీ ఈ అనుసంధానం కాని బ్యాంక్ ఖాతాలు లక్షల్లో ఉన్నాయని చెప్పారు. దీంతో లబ్ధిదారుడి ఖాతాకు నగదు బదిలీ డబ్బులు జమకాని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌పీసీఐ మ్యాపర్‌లో ఆధార్‌కు లబ్ధిదారుని ఖాతా నంబరును అనుసంధానం చేసేందుకు పోస్టల్ కార్యాలయాల్లో ఈ నెల 15వ తేదీ వరకు స్పెషల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆయా అంశాలను పోస్టల్ అధికారులు ఖాతాదారులకు తెలియజేసి చైతన్యపరచాలని చెప్పారు. సమావేశంలో ఎంవో నరేంద్ర, ఐపీపీబీ అధికారి ప్రియ, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాల్వలో గుర్తుతెలియని మృతదేహం



తేలాడుతున్న వ్యక్తి మృతదేహం

వేటపాలెం: రామన్నపేట స్ట్రయిట్ కట్ కాల్వలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. ఎస్సై వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కాల్వలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలియాడుతోందన్న సమాచారంతో అక్కడకు వెళ్లి పరిశీలించామన్నారు. మృతుడికి దాదాపు 55 ఏళ్లు ఉంటాయని, కేవలం బులుగు నిక్కరు మాత్రమే ఉందని తెలిపారు. రెండు రోజుల కిందట కాల్వలో పడి పైనుంచి నీటి ప్రవాహానికి కొట్టుకొచ్చి ఉంటాడని భావిస్తున్నారన్నారు. సమాచారం అందుకున్న ఎస్సై ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్త చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

### ఎవరికీ భారం కాకూడదని..

యద్దనపూడి: తాను ఎవరికీ భారం కాకూడదంటూ ఓ దివ్యాంగురాలు బలవంతంగా తనువు చాలించింది. ఈ ఘటన మండలంలోని జాగర్లమూడి గ్రామంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. జాగర్లమూడి గ్రామస్తురాలు తెళ్ల శ్రీరావమ్మ (41)కు పోలియోతో రెండు కాళ్లు, ఒక చేయి చచ్చుబడ్డాయి. ఆమె తన తల్లితో కలిసి గ్రామంలోనే టీ కొట్టు పెట్టుకొని జీవనం సాగిస్తోంది. తల్లి ఇటీవల అనారోగ్యంతో మంచాన పడడంతో శ్రీరావమ్మ మానసిక క్షోభకు గురైంది. తాను ఎవరికి భారం కాకుడదనే ఉద్దేశంతో గత బుధవారం ఇంటిలో పురుగు మందు తాగింది. ఇది గమనించిన బంధువులు, ఇరుగుపొరుగు వారు చికిత్స నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం శ్రీరావమ్మ మృతి చెందింది. మృతురాలి సోదరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పర్చూరు ఎస్సై మల్యాద్రి తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



గాయపడిన సాంబశివరావు

జే.పంగులూరు: మూత్ర విసర్జనకు వెళ్లి తిరిగి కారు ఎక్కేందుకు వస్తున్న వ్యక్తిని వెనుక నుంచి ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం మండల పరిధిలోని భగవాన్‌రాజుపాలెం సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. ఏలూరు జిల్లా నాగులదేవరపాడు గ్రామానికి చెందిన పల్లి సాంబశివరావు విధి నిర్వహణలో భాగంగా కారులో ఒంగోలు వెళ్తున్నాడు.

భగవాన్ రాజుపాలెం ఫ్లైఓవర్ సమీపంలోకి రాగానే కారు దిగి రోడ్డు మార్గంలో మూత్ర విజర్జన చేసి తిరిగి కారు ఎక్కేందుకు వస్తున్నాడు. రహదారి వెంబడి ఒంగోలు వైపు వెళ్తున్న ఆటో ఢీకొనడంతో సాంబశివరావు తలకు బలమైన గాయమైంది. ఆటో డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న మరో వ్యక్తి కూడా గాయాలయ్యాయి. క్షతగాత్రులను ముగ్గురిని హైవే అంబులెన్స్ సిబ్బంది చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాంబశివరావును మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సాంబశివరావు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని సోదరుడు గణపతి తెలిపారు. ఆటో డ్రైవర్‌ను ఒంగోలు తరలించారు. ఆటోను పోలీసులు రేణింగవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

## ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

- యువతలో అవగాహన పెరగాలి
- జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పిలుపు



మాట్లాడుతున్న రాకేష్ భరద్వాజ్

మంగళగిరి: ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు అని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. మండలంలోని నీరుకొండ గ్రామంలో ఉన్న ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం సెల్‌ఫోన్ల తయారీ సంస్థ ఒప్పో ఇండియా కంపెనీతో కలిసి ఈ వేస్ట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. దృశ్యమాధ్యమ పద్ధతిలో వీడియో సందేశాన్ని కలెక్టర్ పంపారు. గ్రామీణ ప్రాంతాలలో స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు సమస్యను పరిష్కరించడంలో ముందుకు రావాలన్నారు. ఒప్పో ఇండియా కంపెనీ ప్రజావ్యవహారాల విభాగాధిపతి రాకేష్ భరద్వాజ్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సెల్‌ఫోన్ల తయారీలో రెండవ స్థానంలో ఉన్నా భారత్‌లో ఈ వేస్ట్ సైక్లింగ్‌లో వెనుకబడి ఉన్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రోజుకు 50 మిలియన్ల టన్నులు ఈ వేస్ట్ పేరుకుపోతోందని, దీనిని ఎప్పటికపుడు తగ్గించకపోతే పర్యావరణానికి ప్రమాదం తప్పదన్నారు. ఇన్‌చార్జి వీసీ భరద్వాజ్ శివకుమారన్, డీన్ డాక్టర్ సివీ టామి, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ రంగభాష్యం, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డెబ్లినా దత్తా తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్‌సీ కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలి

ఏపీఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసెఫ్ సుధీర్‌బాబు డిమాండ్





మాట్లాడుతున్న జోసెఫ్ సుధీర్‌బాబు

వినుకొండ(నూజెండ్ల): పీఆర్‌సీ కమిటీని వెంటనే ఏర్పాటు చేసి కమిటీ నివేదిక వచ్చేవరకు వెంటనే 35 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్. జోసెఫ్ సుధీర్‌బాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు అయి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటికీ పీఆర్‌సీ కమిటీ గురించి కనీసం ఊసెత్తడం లేదని, వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయాలన్నారు. నిత్యావసర ధరల పెరుగుదల మేరకు కరువు భత్యాయన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఆగిరిపల్లి ట్రైనింగ్ సెంటర్‌లో ఉండి ప్రధానోపాధ్యాయులు మృతిచెందారని, బాపట్ల శిక్షణ కేంద్రంలోనూ ఉపాధ్యాయులు అస్వస్థతకు గురయ్యారని, నాన్ రెసిడెన్షియల్ విధానంలో ట్రైనింగ్‌లు జరపాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన ప్రధానోపాధ్యాయులు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జీవో నెం. 117ను రద్దు చేయాలన్నారు. రాష్ట్రంలోని ఉద్యోగులందరికీ ఒకే పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఎల్.వి. రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి యు.చంద్రజిత్ యాదవ్, నాయకులు మహబూబ్ సుభాని, వెంకట్‌రెడ్డి, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ట్రాఫిక్‌కు కారణమవ్వొద్దు



నగరం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రహదారులపై పండ్ల దుకాణాలు, తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ భార్గవ్ హెచ్చరించారు. మండల కేంద్రమైన నగరంలో గురువారం ఎస్‌ఐ భార్గవ్ పండ్ల దుకాణాలు, తోపుడు బండ్ల నిర్వాహకులకు పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రయాణికులు, వాహనచోదకులకు ఇబ్బందుల కలగకుండా చిరు వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

### ఏఎన్‌యూ వెయిట్ లిఫ్టింగ్‌కు విద్యార్థి ఎంపిక



నగరం: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వెయిట్ లిఫ్టింగ్ జట్టుకు కళాశాలకు చెందిన ఎ.అరుణ్జినేష్ ఎంపికైనట్లు కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో గురువారం అరుణ్జినేష్‌కు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చియ్య చౌదరి మాట్లాడుతూ అరుణ్జినేష్ ఇటీవల జరిగిన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాల పోటీలలో ప్రతిభ కనబర్చి యూనివర్సిటీ జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థిని ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ, పీఈడీ సాంబమూర్తి అభినందించారు.

### ఎంపీపీకి మాతృ వియోగం



నగరం: ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య తల్లి అచ్చిమ్మ(68) బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె అంత్యక్రియలు గురువారం ఈదుపల్లి గ్రామంలో జరిగాయి. మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు అచ్చిమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎంపీపీ శ్రీకృష్ణయ్యను పరామర్శించి, సానుభూతి తెలిపారు.

### మద్యం బెల్టు షాపుల నిర్వాహకుల అరెస్ట్

వేమూరు: మద్యం బెల్టు షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ జి.రవి కుమార్ తెలిపారు. వేమూరు, జంపని, పోతుమర్రు, అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామానికి చెందిన బెల్టు షాపుల నిర్వాహకులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు. కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

### స్కూల్ గేమ్స్‌లో మున్సిపల్ విద్యార్థుల ప్రతిభ



తెనాలి: నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కాలేజిలో ఆరో తేదీన జరిగిన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ స్విమ్మింగ్ పోటీల్లో స్థానిక రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూలు విద్యార్థి శశికుమార్ అత్యంత ప్రతిభ కనబరిచినట్టు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు చిలకా సుందరరావు తెలియజేశారు. బ్యాక్ స్ట్రోక్ లో 50 మీటర్స్ లక్ష్యాన్ని 1.10 నిముషాల్లో సాధించినట్లు తెలిపారు. అదేవిధంగా శ్రీకాకుళంలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థి ఆకుల మణికంఠ హైజంప్‌లో రాష్ట్రంలో 4వ స్థానం సాధించగా, జి.కాటంరాజు 400 మీటర్స్ రిలేలో 3వ స్థానంలో నిలిచినట్లు వివరించారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు టి.ప్రసాద కుమారి, కొడాలి గోవర్ధన, ఎన్‌సీసీ అధికారి పరిశా సర్దార్, బి.శ్రీనివాసు, చక్రవర్తి, రాజ రాజేశ్వరి, లక్ష్మీకాంతం ఆయా విద్యార్థులను అభినందించారు.

### చికిత్స పొందుతూ వివాహిత మృతి

తెనాలిరూరల్: ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ కలహాల నేపథ్యంలో పట్టణ బాలాజీరావుపేటకు చెందిన వివాహిత అఫ్సానా గత నెల 31వ తేదీన మార్కెట్‌లో ఒంటిపై పెట్రోలు పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేసిన సంగతి తెలిసిందే. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందింది. వైద్యశాల నుంచి సమాచారం మేరకు వన్ టౌన్ పోలీసులు గురువారం శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.



సాగులో ఉన్న మినుము పంట

# మినుముకు పల్లాకు గండం

- లంక గ్రామాల్లో సాగు దినదిన గండం
- గతంలో వరదలకు నీట మునిగిన వాణిజ్య పంటలు
- ప్రత్యామ్నాయంగా మినుము వేసిన రైతులు
- ప్రస్తుతం పల్లాకు తెగులుతో ఆందోళన
- వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవాలని విన్నవం

వేమూరు: లంక గ్రామాల్లో పంటల సాగు దిన దిన గండంగా మారింది. సెప్టెంబరులో వరదలకు ఇక్కడ సాగు చేసిన వాణిజ్య పంటలు నీట మునిగాయి. దీంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. వరదలు పూర్తిగా తగ్గిపోయిన తర్వాత రైతులు ప్రత్యామ్నంగా మినుము పంట సాగుపై మొగ్గు చూపారు. కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లోని లంక గ్రామాల రైతులు వెయ్యి ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. పంట పూత దశలోకి రావడంతో పల్లాకు తెగులు వ్యాపించింది. నివారణకు అనేక మందులు పిచికారి చేసినా.. నివారణ సాధ్యం కావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. పల్లాకుతో మినుము పంట పూర్తిగా దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలోని రైతులు మినుము, పెసర పంటలకు పల్లాకు తెగులు రావడంతో కొంత కాలం ప్రత్యామ్నాయ పంటలుగా జొన్న, మొక్కజొన్న సాగు చేశారు. ప్రస్తుతం ప్రత్యామ్నంగా మినుము సాగు చేశారు. పల్లాకు తెగులు నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలివ్వాలని రైతులు కోరుతున్నారు.

### ఆందోళన తప్పడం లేదు



మినుము పంటకు పల్లాకు తెగులు వ్యాపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదలకు ఇక్కడ వాణిజ్య పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పుడు మినుము కూడా తెగులు బారిన పడింది.

– తోడేటి రత్నాకర్, రైతు, చింతర్లంక

### ప్రత్యేక దృష్టి పెట్టాలి



మినుము పంటకు పల్లాకు తెగులు వ్యాపించింది. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, రైతులను నష్టం నుంచి గట్టెక్కించాలి.

– తోడేటి సురేష్, రైతు, చింతర్లంక

# రోడ్లకు మరమ్మతులు



చినపులివర్రు గ్రామం రోడ్డులో చిప్స్ చదును



ఇలా గుంతలు చదును చేస్తూ..

వేమూరు: అర్ అండ్ బీ రోడ్లకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. మండలంలోని జంపని నంచి మూల్పూరు, వేమూరు నుంచి చిన పులివర్రు అర్అండ్‌బీ రోడ్ల గుంతలు పూడ్చుతున్నారు. కూటమి ప్రభుత్వం నూతన రోడ్లు వేస్తామని చెప్పి..ఇలా మరమ్మతులు చేపట్టడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

## సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదం



తమ నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తెనాలిఅర్బన్: విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎక్స్‌పోలు దోహదపడతాయని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ డాక్టర్ జేమ్స్ మోర్లే పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని స్కూల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ ఎక్స్‌పోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనికిరాని (వేస్ట్ మెటీరీయల్) వాటితో విద్యార్థులు వివిధ రకాల వస్తువులు తయారు చేసినట్లు చెప్పారు. నేటి సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియాకు బానిసలై విద్యను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో వారితో ఇలాంటి యాక్టివిటీలు చేయిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### సేవా గుణాన్ని అలవర్చుకోవాలి

బాపట్లటౌన్:ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ తెలిపారు. పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలోని తుఫాన్ షెల్టర్‌లో నివాసం ఉండే గిరిజనులకు గురువారం భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. సమాజంలో ఆర్థికకంగా అభివృద్ధి చెందిన ప్రతి ఒక్కరూ తమ పరిసర ప్రాంతాల్లోని పేదలను గుర్తించి, వారికి సహాయ సహకారాలు అందిస్తే పేదరికాన్ని చాలా వరకు నివారించగలమన్నారు. సొసైటీ సభ్యులు కె.సుజాత, జి.జైపాల్, పాస్టర్ విజయరాజు పాల్గొన్నారు.

### అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు



తెనాలిరూరల్: డిసెంబర్ 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ లఅదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి డి. శ్రీనివాసులు న్యాయవాదులను కోరారు. తెనాలి కోర్టు సముదాయంలో గురువారం సాయంత్రం న్యాయవాదులతో ఆయన సమావేశమయ్యారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ పడితే కోర్టు ఫీజులు సైతం వాపసు వస్తాయని, కక్షిదారులకు దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నిటిని అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్, జూనియర న్యాయవాదులు పాల్గొన్నారు.

### 18 షాపులకు రెండేళ్ల అనుమతులు

తెనాలిరూరల్: తెనాలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయ పరిధిలోని 25 మద్యం దుకాణాలకు గాను 18 దుకాణాలకు రెండేళ్ల కాలపరిమితితో పర్మనెంట్ లైసెన్సులు జారీ చేసినట్టు ఎక్సైజ్ సీఐ ఏవీ చలం తెలిపారు. తెనాలి పట్టణంలో రెండు, మండలంలో రెండు, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో మూడు దుకాణాలకు ఇంకా లైసెన్సులు ఇవ్వాల్సి ఉందన్నారు. గురువారం నాటికి 72 శాతంగా 18 దుకాణాలకు పర్మనెంట్ లైసెన్సు జారీ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. తెనాలి మండలం కఠెవరం గ్రామం సహా కొల్లిపర మండలంలో రెండు బెల్టు కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

## వ్యవసాయ పంప్ సెట్లు అందించాలి

ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యాదర్శి ఎం.హరిబాబు



మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం నాయకులు

కొల్లిపర: ఇటీవలన కృష్ణా నదిలో వచ్చిన వరదలు కారణంగా లంక పంట భూమిలో రైతులు ఏర్పాటు చేసుకున్న పంప్ సెట్లు పూర్తిగా దెబ్బతిన్నాయని వాటిని ప్రభుత్వం మరమ్మతులు చేయించాలని, మరమ్మతులకు పనికి రాని పంప్ సెట్ రైతులకు ఉచితంగా కొత్తవి అందించాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యాదర్శి ఎం.హరిబాబు అన్నారు. గురువారం మండలంలోని అన్నవరపు లంక, బొమ్మువానిపాలెం లో రైతు సంఘనాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో స్కూటర్లకి, ఆటోలకి, కార్లకి, తోపుడుబలకి, ఇంట్లో పరికరాలు పాడైతే వాటికి నష్టపరిహారం ఇచ్చిన ప్రభుత్వం లంక గ్రామాలల్లో ఉన్న ఇళ్లల్లో వరద నీరు చేరి ఇళ్లు, ఇంటో ఉన్న వస్తువులతో సహా తీవ్ర నష్టంతో లక్ష నుండి 2 లక్షల వరకు నష్టం జరిగితే కేవలం రూ.10 వేలు ఇచ్చి సరి పెట్టడం సరికాదన్నారు. అదే విధంగా పంట పొలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీళ్ల మోతార్లులకు తీవ్ర నష్టం జరిగినా రైతులకు కేవలం పంట నష్ట పరిహారం స్వల్పంగా ఇచ్చి ఇతర అంశాలపై పట్టించుకోక పోవటం అమానుషం అని వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం కళ్లు తెరచి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సొసైటీ రైతులు మాట్లాడుతూ సొసైటీ భూములల్లో సాగు చేస్తున్న రైతులకు ఇప్పటి వరకు పంట నష్ట పరిహారం అందలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు, ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి, మండల కార్యదర్శి కోటా చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

### • లిఫ్టుకు అనారోగ్యం!



తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలోని లిఫ్ట్ మొరాయించింది. రెండు రోజుల నుంచి ఇది పనిచేయకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తెనాలి పట్టణంలో 1.60 లక్షల జనాభా ఉంటారు. ప్రతిరోజు మున్సిపల్ కార్యాలయంకు వివిధ పనుల నిమిత్తం సుమారు రెండు వందల మంది వరకు వస్తుంటారు. వికలాంగులు, వృద్ధులు మొదటి అంతస్తులో ఉన్న లిఫ్టును ఉపయోగిస్తుంటారు. రెండు రోజుల నుంచి ఇది పనిచేయకపోవటంతో అక్కడికి వచ్చిన వారు మెట్లు ఎక్కలేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే లిఫ్టును బాగు చేయించాలని కోరుతున్నారు.

-తెనాలిఅర్బన్

### పేదలకు నిత్యావసరాల పంపిణీ

తెనాలిఅర్బన్: దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో పట్టణంలోని యడ్లలింగయ్య కాలనీ, కఠెవరం కాల్వ కట్ట, టీచర్స్ కాలనీ, బాలాజీరావుపేటలో నివశించే పేదలకు 13 రకాల నిత్యవసర వస్తువులను గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా జిల్లా కో ఆర్డినేటర్ రవితేజ మాట్లాడుతూ పేదలకు సేవ చేసేందుకు సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెనాలి, గుంటూరు సిటీల కో ఆర్డినేటర్‌లు రాజశేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# పొత్తు ధర్మం జనసేనకేనా..!

- కూటమిలో కరివేపాకులా జనసైనికులు
- సూర్యలంకలో జనసేన బ్యానర్ ఏర్పాటుపై టీడీపీ ఆగ్రహం
- ఆ పార్టీ ఇన్‌చార్జికి ఫోన్ చేసి మరీ హెచ్చరిక, తొలగింపు



తీరంలోని ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన ఫ్లెక్సీలు



జనసేన ఫ్లెక్సీ తొలగించి టీడీపీ ఫ్లెక్సీ ఏర్పాటు

బాపట్లటౌన్: ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదంటూ గుర్రుగా ఉన్న జనసేన క్యాడర్‌పై మరోసారి విరుచుకు పడ్డారు టీడీపీ నేతలు. కార్తిక పౌర్ణమి పురస్కరించుకొని సూర్యలంక తీరంలోని ప్రధాన ద్వారం వద్ద ఓ వైపు టీడీపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. మరోవైపు జనసేన నాయకులు సోమవారం సాయంత్రం బ్యానర్ కట్టారు. మీరు వెంటనే ఇక్కడి నుంచి బ్యానర్ తొలగించాలని పచ్చ నేతలు జనసేన నాయకులను హెచ్చరించారు... కానీ, కార్యకర్తలు పట్టించుకోకపోవడంతో ఏకంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జికు ఫోన్ చేసి ఈ ప్రాంతంలో తమ బ్యానర్లు మాత్రమే ఉండాలని, ఇక్కడి నుంచి వెంటనే బ్యానర్‌ను తొలగించాలని హుకుం జారీ చేశారు. కానీ, ఇన్‌చార్జి.. 'మనమంతా ఒక్కటే కదా...మీది..మాది ఏంటీ' అని అంటుండగానే.. ఇవన్నీ తమకు అనవసరం అని, బ్యానర్ ఇక్కడి నుంచి తీస్తున్నారా...లేదా అంటూ మరోసారి హెచ్చరించారు. తాము బ్యానర్ అక్కడి నుంచి తీసేది లేదు....ఎలా తీస్తారో తీయండంటూ సమాధానం ఇచ్చారు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహించిన టీడీపీ నేతలు వెంటనే జనసేన బ్యానర్‌ను తొలగించి, ఆ ప్రాంతంలో టీడీపీ బ్యానర్‌ను ఏర్పాటు చేశారు. అలాగే కార్తిక పౌర్ణమి రోజు తీరానికి వచ్చే భక్తులకు అల్పాహారం అందించేందుకు ఇరుపార్టీల నేతలు పోటాపోటీగా స్థలాలను ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. గతంలో జనసేన పార్టీ అల్పాహారం పెట్టిన ప్రదేశం టీడీపీ కైవసం చేసుకోవడంతో చేసేదేమీ లేక జనసేన నాయకులు ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో స్థలాన్ని శుభ్రం చేసుకొని ఏర్పాట్లు చేసుకుంటున్నారు. జనసేన నాయకులు ఏర్పాటు చేసే ప్రతి బ్యానర్‌లో పొత్తు ధర్మంలో భాగంగా టీడీపీ, బీజేపీ నాయకులకు తగిన ప్రాధాన్యం ఇస్తున్నారు. టీడీపీ నేతలు ఏర్పాటు చేసే బ్యానర్లలో జనసేన నాయకుల ఫొటోలు కనిపించడం లేదు.

# ప్రొటోకాల్ పాటించండి

- ప్రజా ప్రతినిధులకు ప్రాధాన్యమివ్వాలి..
- మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ



మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ నాంచారమ్మ

కొల్లూరు(వేమూరు): అధికారులు స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వం కార్యక్రమాలకు ప్రోట్ కాల్ పాటించడం లేదని ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీ అధ్యక్షత వహించారు. ప్రభుత్వం కార్యక్రమాలు కూటమి నాయకులతో నిర్వహించడంపై అధికారులను దీశారు. ఎంపీడీవో చొరవ తీసుకొని ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రొటోకాల్ తప్పకుండా పాటించడం జరుగుతుందని ఆయన హామీ ఇచ్చారు. మండలంలోని రహదారులు చాల అధ్వానంగా మారి ప్రయాణం నరక ప్రాయంగా మారిందిన అర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి అర్అండ్‌బీ అధికారులు గైర్హాజరు కావడంతో చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఉచిత ఇసక తరలింపు విషయంలో పక్కనే ఉన్న గుంటూరు జిల్లాలోని మండలాలు, గ్రామాలల్లో లేని నిబంధనలు బాపట్ల జిల్లాల్లో ఎమిటని అధికారులను నిలదీశారు. ఎంపీడీవో కొత్తపల్లి నరసింహారావు మాట్లాడుతూ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి హజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మురాల రాంబాబు ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

# మురుగు సమస్య లేకుండా చూడండి

అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి



మురుగు కాల్వను శుభ్రం చేయిస్తున్న ఏసీ

తెనాలిఅర్బన్: పట్టణంలో మురుగు సమస్య లేకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతి ఆదేశించారు. పట్టణంలోని 29, 30 వార్డుల్లో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు కాల్వలను శుభ్రం చేయాలన్నారు. అలాగే పెద్ద పెద్ద కాల్వల్లో గ్యాంగ్ వర్కు చేయిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నజీర్, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

# 10న ఉచిత రక్తనాళాల పరీక్షల శిబిరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రోటరీ క్లబ్ వైకుంఠపురం ప్రతినిధులు

తెనాలిఅర్బన్: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, ఏషియన్ వాస్కులర్ హాస్పటల్స్ హైద్రాబాద్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 10న ఉచిత రక్త నాళాల వైద్య పరీక్షల శిభిరాన్ని నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు తెలిపారు. టుటౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డులోని రోటరీ క్లబ్ కార్యాలయంలో గురువారం ఉచిత వైద్య శిబిరానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త నాళాల వైకల్యం , రక్తంలో గడ్డలున్నాయా లేదా అనే సుమారు రూ.5వేల విలువ చేసే పరీక్షలు ఇక్కడ ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు. బస్టాండ్ అవుట్ గేట్ ఎదురు ఉన్న ఈగల్ రెస్టారెంట్ వద్ద ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమౌతుందని చెప్పారు. అందరు దీనిని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కన్నెగంటి మురళీకృష్ణ, ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వర రావు, ప్రవీణ్, ఉపేంద్ర, ఏషియన్ వాస్కులర్ హాస్పటల్ మార్కెటింగ్ హెడ్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

### 'ఓపి'క లేదయ్యా..!



తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చిన రోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్, సెల్ ఫోన్ తీసుకురానిదే.. అక్కడ వైద్యం అందని పరిస్థితి. వైద్యశాలలో రోజూ వెయ్యి మందికి పైగా అవుట్ పేషంట్లు వైద్య సేవలు పొందుతున్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులు ముందుగా అభా యాప్‌లో పేరు నమోదు చేసుకోవాలి. ఇందుకు అధార్ నంబరు, సెల్‌ఫోన్ ఉండాలి. గ్రామీణ ప్రజలు ఆవేమి లేకుండా వైద్యశాలకు వస్తున్నారు. గురువారం వైద్యశాలకు వచ్చి..వైద్యం పొందకుండా సుమారు 10 మంది వెనక్కి వెళ్లిపోయారు.

-తెనాలి అర్బన్